క్లుప్తంగా

సైన్స్‌ పార్కు పరిశీలన



సైన్స్‌ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్‌ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్‌): నగరంలోని స్థానిక అమ్మహాస్పిటల్‌ సమీపంలోని గఫార్‌ నగర్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన సైన్స్‌ పార్కును నగరపాలక కమిషనర్‌ భార్గవ్‌తేజ బుధవారం పరిశీలించారు. స్థానికంగా కాలనీవాసులతో పాటు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఈ పార్కును రూ.1.65 కోట్ల జనరల్‌ ఫండ్‌ నిధులతో తీర్చిదిద్దారు. పిల్లలు ఆడుకుంటూ సైన్స్‌ గురించి తెలుసుకునే విధంగా ఏర్పాటు చేసిన ఈ పార్కును త్వరలోనే ప్రారంభించనున్నట్లు నగర పాలక అధికారులు వెల్లడించారు. అందులో భాగంగానే కమిషనర్‌ పార్కును పరిశీలించిన పెండింగ్‌ ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కమిషనర్‌ వెంట ఇన్‌చార్జ్‌ ఈఈ షాకీర్‌ అహమ్మద్‌, ఏఈ దినేష్‌ ఉన్నారు.

నేడు పలు చోట్ల విద్యుత్‌ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్‌): కర్నూలు నగరంలోని జొహరాపురం సబ్‌స్టేషన్‌లో గురువారం అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా పలు చోట్ల విద్యుత్‌ కోతలు విధించనున్నట్లు ఏఈ శ్రావణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేస్తుండడంతో జొహరాపురం, జమ్మిచెట్టు, మంగళిగేరి, చిత్తారి గేరి, కుమ్మరిగేరి, రాంబొట్ల దేవాలయం, నిమిషాంబదేవి గుడి, బడిబీత్‌ గేరి, కమేళా, గడ్డ, బేకార్‌ కట్ట, పెద్దపడఖానా, సద్గూరు, మేడవారి స్ట్రీట్‌, కిమ్స్‌ హాస్పిటల్‌ ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్‌ ఎత్తివేత

కర్నూలు (టౌన్‌): విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శివశంకర్‌పై విధించిన సస్పెన్షన్‌ను నగరపాలక కమిషనర్‌ భార్గవ్‌తేజ బుధవారం ఎత్తివేశారు. గత వారంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ముగ్గురు చెత్త వాహనాల డ్రైవర్లను కమిషనర్‌ సస్పెండ్‌ చేసిన విషయం విదితమే. వీరందరిని విధుల్లో చేరాలని కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ యు.శ్రీనివాసులును బాధ్యతల నుంచి తప్పించినా కమిషనర్‌ తాజాగా కోడుమూరు పరిధిలోని వార్డులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు.

బలవర్ధక ఆహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్‌ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్‌): తక్కువ ఖర్చుతో లభించే బలవర్ధకమైన, పోషక విలువలున్న ఆహారాన్ని ప్రతి ఒక్కరూ నిత్యం తీసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్‌ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్థానిక వెంకటరమణ కాలనీలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మున్సిపల్‌ మెమోరియల్‌ కార్పొరేషన్‌ హైస్కూల్‌లో బుధవారం ఆయుష్‌ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అందరికీ జీవనశైలి, మన ఆరోగ్యం, గృహవైద్యం గురించి, సీజనల్‌ వ్యాధులకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్‌ ద్వారం ప్రభాకర్‌రెడ్డి వివరించారు. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు, రసాలు గల ఆహార పదార్థాలు తగు మోతాదులో తీసుకోవడం వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌.రాజేశ్వర్‌రెడ్డి, ఉప ప్రధానోపాధ్యాలు యుఎస్‌.రేఖ, ఉపాధ్యాయులు ఆర్‌. హరగోపాల్‌, కె.ఖాజాహుసేన్‌ తదితరులు పాల్గొన్నారు.

1న విష్ణు సహస్రనామ స్తోత్ర కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్‌: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీన కర్నూలు సీక్యాంప్‌ టీటీడీ కల్యాణ మండపంలో అచ్యుతాష్టకం, విష్ణు సహస్రనామ స్తోత్ర కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్‌ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం గోదా గోకులంలో పరమహంస, పరివ్రాజకాచార్యులు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌ స్వామి పోటీలకు సంబంధించిన సాహిత్య పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మికత, భక్తి భావం పెంపొందించేందుకు టీటీడీ నిర్వహించే కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, లలితా పీఠం పీఠాధిపతులు మేడు సుబ్రహ్మణ్యం స్వామి, సుదర్శనాచార్య, రమేష్‌ ఆచార్య, రంగనాథ ఆచార్య, శ్రీకాంతాచార్య స్వామి తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 90598 02265 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నగరం ‘సేఫ్‌’

- సత్ఫలితాలిస్తున్న సేఫ్‌ సిటీ కార్యక్రమం
- కర్నూలు పోలీస్‌ వెబ్‌సైట్‌కు అనూహ్య స్పందన
- రెండు వారాల వ్యవధిలో 53 కాలనీల నుంచి ఫిర్యాదు
- ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా కాలనీల్లో పెరిగిన పోలీసు గస్తీ



కర్నూలు: కర్నూలు నగరాన్ని సేఫ్‌ సిటీగా మార్చేందుకు ఎస్పీ సిద్ధార్థ్‌ కౌశల్‌ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం డిసెంబర్‌ 31వ తేదీన ప్రత్యేకంగా 22 వాహనాలను ఎస్పీ సమకూర్చారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు గస్తీని ముమ్మరం చేశారు. కర్నూలు పట్టణ ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉన్నా, కాలనీలు, వీధులు తదితర ప్రాంతాలు పోలీస్‌ పెట్రోలింగ్‌ చేయాలని కోరినట్లయితే కర్నూలు పోలీస్‌ వెబ్‌సైట్‌ http:// kurnoolpolice. in/ safecity లింక్‌ను క్లిక్‌ చేసి పేరు, మొబైల్‌ నెంబర్‌, సమస్య, ఏ ఏరియాలో పెట్రోలింగ్‌ (గస్తీ) కావాలి, ఏ పోలీస్‌ స్టేషన్‌ పరిధి, ఏ సమయంలో పోలీస్‌ పెట్రోలింగ్‌ కావాలి అనే విషయాలను నమోదు చేసి సబ్‌మిట్‌ చేస్తే ఆయా ప్రాంతాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేస్తున్నారు. ఈ లింక్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రెండు వారాల్లో సుమారు 53 కాలనీల నుంచి ప్రజలు స్పందించి లింక్‌లో వివరాలను నమోదు చేసి గస్తీని పెంచాలని కోరారు.

పోలీసు నిఘా పెరిగింది



కర్నూలు సి.క్యాంప్‌ సర్కిల్‌, మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఇంగ్లిష్‌ మీడియం స్కూల్‌, ప్రభుత్వ క్వాటర్స్‌ ప్రాంతాల్లో రాత్రివేళల్లో అల్లరి మూకలు బహిరంగంగా మద్యం సేవిస్తూ ఈవ్‌ టీజింగ్‌కు పాల్పడేవారు. పోలీస్‌ వెబ్‌సైట్‌లో గస్తీ పెంచమని రిక్వెస్ట్‌ పెట్టడంతో పోలీసులు స్పందించి మందుబాబులను కట్టడి చేశారు. -వి.మహేష్‌, సి.క్యాంప్‌

రిక్వెస్ట్‌కు పోలీసులు స్పందించారు



వెంకటరమణ కాలనీ ఏరియాలో అల్లరిమూకల వల్ల రాత్రి మహిళలు బయటకు రావడానికి ఇబ్బంది పడేవారు. పోలీస్‌ వెబ్‌సైట్‌లో గస్తీ రిక్వెస్ట్‌ పెట్టడంతో పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించారు. ప్రతిరోజు కూడా గస్తీ ఏర్పాటు చేసి ఎలాంటి సమస్య లేకుండా చూడాలి. – శైలజ, వెంకటరమణ కాలనీ

సేఫ్‌ సిటీ కోసం ఏర్పాటు చేసిన గస్తీ వాహనాలు, సిబ్బంది(ఫైల్‌)



డ్రంకెన్‌ డ్రైవ్‌ను కట్టడి చేశారు



కర్నూలు పాతబస్తీ ఉస్మానియా కాలేజీ రోడ్డు లో డ్రంకెన్‌ డ్రైవ్‌, ర్యాష్‌ డ్రైవింగ్‌ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కర్నూలు పోలీస్‌ వెబ్‌సైట్‌లో రిక్వెస్ట్‌ పెట్టాను. సమస్యకు స్పందించి పోలీసులు రాత్రి గస్తీ ఏర్పాటు చేసి పరిష్కరించినందుకు కృతజ్ఞతలు. -మాలిక్‌ ఖాన్‌, ఉస్మానియా కాలేజ్‌ రోడ్‌

అల్లరిమూకల ఆగడాలకు కళ్లెం



కర్నూలు సేఫ్‌ సిటీ లక్ష్యంగా ఏర్పాటు చేసిన కర్నూలు పోలీస్‌ వెబ్‌సైట్‌కు చేసిన ఫిర్యాదుకు పోలీసులు స్పందించి అల్లరి మూకల ఆగడాలకు కళ్లెం వేశారు. విజయనగరం కాలనీ గుత్తి పెట్రోల్‌ బంకు సమీపంలో రాత్రి పూట దొంగతనాలు, చిన్నచిన్న అల్లర్లు జరిగేవి. పోలీస్‌ వెబ్‌సైట్‌కు రాత్రి గస్తీ పెంచాలని రిక్వెస్ట్‌ పెంచడం వల్ల ఇప్పుడు ఆ ప్రాంతంలో అల్లరి మూకల సంచారం తగ్గింది. -ఈశ్వర్‌, విజయనగర్‌ కాలనీ

పగటి పూట గస్తీ పెంచాలి



కర్నూలు శివారులోని మునగాలపాడు సమ్మర్‌ స్టోరేజ్‌ దగ్గర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీస్‌ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయగా గస్తీ పోలీసులు స్పందించి రాత్రివేళల్లో సమ్మర్‌ స్టోరేజ్‌ దగ్గర గస్తీ ముమ్మరం చేశారు. అయితే పోలీసులు పగటి పూట కూడా ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలను అరికట్టాలి. -శైలజ, మునగాలపాడు

సమస్య పరిష్కరించారు



కర్నూలు నగరం ఎన్‌ఆర్‌ పేటలో కొంత మంది యువకులు రాత్రివేళల్లో గుంపులుగా చేరి అల్లరి చేస్తూ ర్యాష్‌ డ్రైవింగ్‌కు పాల్పడేవారు. పెద్ద పెద్ద శబ్దాలతో కాలనీ ప్రజలను ఇబ్బంది పెట్టేవారు. సేఫ్‌ సిటీ లక్ష్యంగా ఏర్పాటు చేసిన పోలీస్‌ వెబ్‌సైట్‌లో రాత్రి గస్తీ కోసం రిక్వెస్ట్‌ పెట్టగా పోలీసులు స్పందించి పరిష్కరించారు. -ప్రదీప్‌కుమార్‌, ఎన్‌ఆర్‌ పేట

వడ్డె ఓబన్న పోరాటం చిరస్మరణీయం



ఓబన్న జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్‌ బీవై రామయ్య

- నగర మేయర్‌ బీవై రామయ్య

కర్నూలు(అర్బన్‌): బ్రిటీష్‌ పాలకులకు వ్యతిరేకంగా వడ్డె ఓబన్న చేసిన పోరాటం చిరస్మరణీయమని నగర మేయర్‌ బీవై రామయ్య అన్నారు. బుధవారం వడ్డె ఓబన్న 216వ జయంతి వేడుకలను స్థానిక బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మేయర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా బీసీ భవన్‌ ప్రాంగణంలో ఉన్న వడ్డె ఓబన్న విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సమరంలో వడ్డె ఓబన్న గొప్ప పోరాట యోధులన్నారు. ఆయన పోరాట పటిమ అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్వసైన్యాధ్యక్షులుగా వడ్డె ఓబన్న దేశం కోసం తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. ఆయన చేసిన త్యాగం తెలుగుజాతి ఎన్నటికీ మరచిపోదన్నారు. బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. అలాగే ఆయన జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌ మద్దయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, నాయకులు సురేష్‌, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌, బోయ శ్రీనివాసులు, చంద్రికమ్మ, రజక శ్రీనివాసులు, వడ్డెర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

కర్నూలు(అగ్రికల్చర్‌): కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌ కంపెనీ, పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరమితి(పీఏసీఎస్‌) సంయుక్తంగా కర్నూలు మండలం పసుపల గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగరవేయడం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వందలాది మహిళలు పోటీల్లో పాల్గొని కనువిందైన ముగ్గులు వేశారు. విజేతలకు కోరమాండల్‌ కంపెనీ జోనల్‌ మేనేజర్‌ ఎం.గోవిందరావు, సీనియర్‌ అగ్రానమిస్ట్‌ శ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్‌ ఆఫీసర్‌ శివకుమార్‌, పసుపల సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మురళీధర్‌ చౌదరి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఎండీటీలు సమీవుల్లా, అబ్దుల్‌కరీమ్‌బాష, న్యూట్రి క్లీనిక్‌ ఎగ్జిక్యూటివ్‌ ఉదయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న కోరమాండల్‌ కంపెనీ ప్రతినిధులు

స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు

కర్నూలు సిటీ: నగరంలోని పలు స్కూళ్లలో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కేవీఆర్‌ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో జరిగిన వేడుకల్లో స్కూల్‌ కరస్పాండెంట్‌ శ్రీనివాసరెడ్డి, ఏఓ విజయలక్ష్మీలు పాల్గొన్నారు. చిన్నారుల వేషధారణలు, ఆటలు, రంగవల్లులు ఆకట్టుకున్నాయి. స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాల ఆవరణలో భోగి మంటలు, రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టి సంబరాలు చేసుకున్నారు. వేడుకల్లో ఆర్‌ఐ దుర్గాలక్ష్మీ, ప్రిన్సిపాల్‌ మహమ్మద్‌ అల్తాఫ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ ముంతాజ్‌, రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఏక్యాంపులోని మాంటిస్సోరి ఐ–కిడ్స్‌ స్కూల్‌లో పల్లె వాతావరణం ఉట్టిపడేలా వేడుకలు జరుపుకున్నారు. ఇందులో చిన్నారులు రంగుల ముగ్గులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలను పెట్టి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్‌ హెచ్‌ఎం జ్యోతి, ఐ–కిడ్స్‌ ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాంటిస్సోరిలో సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు, ఉపాధ్యాయినులు



కూడారై పూజలు నిర్వహిస్తున్న పండితులు



కూడారై సేవల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా కూడారై సేవ

కర్నూలు కల్చరల్‌: ధనుర్మాస పూజల్లో భాగంగా నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదాగోకులంలో బుధవారం కూడారై సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్షీర పాయస పాత్రలతో చతుర్వేదోక్తంగా వేద మంత్రోచ్చారణతో కూడారై ఉత్సవాన్ని వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త, తదితరులు పాల్గొన్నారు. తిరుప్పావై పాసురాలను పారాయణం చేశారు.

పింఛన్‌ పెంచి మేలు చేశారు

- జగన్‌ నల్లగుండాలి
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో వృద్ధురాలు మాలన్‌బీ
- 4వ వార్డులో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



గని గల్లీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌

కర్నూలు(రాజ్‌విహార్‌): ‘నాకెవ్వరు లేరు. బాడిగింట్లో ఉంటున్నా. పని చేయనీక శాత కావడం లేదు. ఎట్లా బతకాలి అని అనుకునేదాన్ని. మనవడు జగన్‌ వచ్చినాక పింఛన్‌ పెంచా. ఇప్పుడు రూ.2,750 ఇస్తున్నాడు. ఆ దుడ్లతోనే బతుకుతున్నా. దుడ్ల కోసం యాడికి పోయే పనిలేదు. వలంటీరే ఇంటి కాడికి వచ్చి ఇచ్చిపోతున్నాడు. ఇంకే నాకు. ఆయన సల్లగుండాలి’ అంటూ ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్‌తో ఆనందాన్ని పంచుకుంది గని గల్లీకి చెందిన మాలన్‌బీ. బుధవారం రాత్రి ఎమ్మెల్యే 4వ వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గని గల్లీ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవ్వతాతల కష్టాలను కళ్లారా చూసిన సీఎం జగన్‌ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వారి కోసమే తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. పేదలు ఆర్థికంగా ఎదగాలంటే సంక్షేమ పథకాలు చాలా అవసరమని, వీటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌ అర్షియా ఫర్హిన్‌, రియాజ్‌బాబా, కార్పొరేటర్‌ జుబేర్‌, నాయకులు ఖాదర్‌, మాబుసా, చున్ను, ఫాజిల్‌, హకీమ్‌, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకుందాం

కర్నూలు (టౌన్‌): మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ మహేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సోమిశెట్టినగర్‌లో ఆంధ్రప్రదేశ్‌ మహిళా సమాఖ్యా నవోదయ ఐక్య సంఘం, ఏఐవైఎఫ్‌ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నగరపాలక డిప్యూటీ మేయర్‌ సిద్దారెడ్డి రేణుకా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

‘అంబేడ్కర్‌ను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి’

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్శిటీలోని సీడీసీ విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్‌ ఇటీవల డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ను, మరో సామాజిక వర్గాన్ని దూషించారని, ఈయనను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ ప్రజా సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో యూనివర్శిటీ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షురాలు అద్దాకుల నాగేశ్వరి మాట్లాడుతూ.. ఇస్మాయిల్‌ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుతో ఫోన్‌ సంభాషణ సమయంలో అంబేడ్కర్‌ను తీవ్రమైన అసభ్యకర పదజాలంతో తిట్టారన్నారు. అయితే ఇస్మాయిల్‌ సముదాయించాల్సిన శ్రీనివాసరావు ఏమాత్రం పట్టించుకోకుండా ఫోన్‌ మాట్లాడారన్నారు. కావున వెంటనే యూనివర్శిటీ అధికారులు స్పందించి వారిరువురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం వర్శిటీ వైస్‌ ఛాన్సలర్‌ ఆకెపోగు ఆనందరావును కలసి ఫిర్యాదు చేశారు. ధర్నాలో దళిత సంఘం నాయకులు జయన్న, కొమ్ముపాలెం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


అంతరాయం లేకుండా విద్యుత్‌ సరఫరా అందించండి

కర్నూలు(రాజ్‌విహార్‌): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్‌ సరఫరా అందించాలని కర్నూలు ఆపరేషన్స్‌ ఎస్‌ఈ ఉమాపతి సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక పవర్‌హౌస్‌లో కర్నూలు డివిజన్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో ఏర్పడే బ్రేక్‌డౌన్స్‌, ట్రిప్పింగ్స్‌ వల్ల విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో కర్నూలు రూరల్స్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ శ్రీనివాసరావు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నేడు ‘రన్‌ ఫర్‌ యువ’

కర్నూలు కల్చరల్‌: భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకొని గురువారం రన్‌ ఫర్‌ యువ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేవైఎమ్‌ జిల్లా అధ్యక్షులు తలారి సుధాకర్‌ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కలెక్టరేట్‌ నుంచి వివేకానంద సర్కిల్‌ వరకు రన్‌ సాగుతుందన్నారు. బీజేవైఎమ్‌ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ నిధులతో 10 ధోబీ ఘాట్లు



రాజసభ సభ్యులు ఆర్‌ క్రిష్ణయ్యకు వినతి పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు బలరామ్‌

కర్నూలు(అర్బన్‌): జిల్లాలో 10 ధోబీఘాట్ల ఏర్పాటుకు ఎంపీ నిధులు కేటాయిస్తానని రాజ్యసభ సభ్యులు ఆర్‌ క్రిష్ణయ్య హామీ ఇచ్చినట్లు రజక ఐక్య సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పీసీ బలరామ్‌ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆర్‌ క్రిష్ణయ్యను కలిసి జిల్లాలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందించామన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ క్రిష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి జూన్‌ నెలలో అభివృద్ధి నిధులు విడుదలవుతాయని, ఆ నిధులను ధోబీఘాట్ల నిర్మాణానికి కేటాయిస్తామని తెలిపారు. అలాగే రజక కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి కూడా సహకారం అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో రజకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

మైనర్లు డ్రైవింగ్‌ చేస్తే కఠిన చర్యలు

కర్నూలు(టౌన్‌): నగరంలో ట్రాఫిక్‌ నిబంధనలు ఉల్లంఘించి మైనర్లు డ్రైవింగ్‌ చేస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు ట్రాఫిక్‌ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. బుధవారం రాత్రి స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్‌ పోలీసులు రాజ్‌విహార్‌, కొత్తపేట ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రిపుల్‌ రైడింగ్‌, అలాగే డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా నడుపుతున్న 19 మంది మైనర్లపై కేసులు నమోదు చేసి రూ.29,165 జరిమానా విధించారు. అనంతరం మైనర్లను కొత్తపేట ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించి రోడ్డు ప్రమాదాలపై వివరించారు. అలాగే తల్లిదండ్రులను పిలిపించి పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మైనర్లచే ఇంకెప్పుడు ట్రాఫిక్‌ నిబంధనలను ఉల్లంఘించం... అని ప్రతిజ్ఞ చేయించారు.

నేడు సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాలు

కర్నూలు కల్చరల్‌: సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాలను గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కర్నూలు నగర శివారులోని కమ్మయడ్లపల్లి పుల్లారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సరస్వతి విద్యా పీఠం జిల్లా అధ్యక్షుడు బి.వేణుగోపాల్‌ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని శిశు మందిరాల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 5 వేలు, పూర్వాచార్యులు వెయ్యి మొత్తం 6 వేల మంది ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాలకు పద్మశ్రీ సహస్రావధాని గరికపాటి నరసింహారావు, విద్యా భారతి అఖిల భారత అధ్యక్షుడు దూసి రామకృష్ణారావు, ఆర్‌ఎస్‌ఎస్‌ అఖిల భారత కార్య కారిణి సభ్యులు వారణాసి రాం మాధవ్‌, ఆర్‌ఎస్‌ఎస్‌ దక్షిణ మధ్య క్షేత్ర సహక్షేత్ర ప్రచారక్‌ భరత్‌కుమార్‌లు అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు.

కంటి జబ్బులపై నిర్లక్ష్యం వద్దు

కర్నూలు(సెంట్రల్‌): ఆటో డ్రైవర్లు పరిపూర్ణమైన కంటిచూపును కలిగి ఉండాలని కంటి వైద్య నిపుణుడు డాక్టర్‌ ఎం.జయప్రకాష్‌ అన్నారు. కంటి జబ్బులపై నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. బుధవారం భగవన్‌ బాల సాయిబాబా క్లినిక్‌లో ఆటో డ్రైవర్లకు కంటి వైద పరీక్షలు నిర్వహించాచారు. అనంతరం జబ్బులు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్‌ అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాయపాటి శ్రీనివాస్‌, పీఎస్‌ రాధాకృష్ణ, నరసింహులు, సాయిబాబా, కె.ప్రభాకర్‌ పాల్గొన్నారు.

14న బాల సాయిబాబా జయంతి

కర్నూలు కల్చరల్‌: భగవాన్‌ శ్రీ బాల సాయిబాబా 62వ జయంతి వేడుకలు, ప్రపంచ శాంతి సదస్సు ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఓల్డ్‌సిటీలోని బాలసాయి బాబా మందిరం శ్రీనిలయంలో నిర్వహిస్తున్నట్లు భగవాన్‌ శ్రీ బాల సాయిబాబా సెంట్రల్‌ ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ రామారావు తెలిపారు. బాలసాయి దీనజన సేవ, ఉచిత వైద్య శిబిరం, సాయంత్రం 6 గంటలకు బాలసాయి నామ సంకీర్తన, ప్రముఖ సంగీత కళాకారులచే సంగీత విభావరి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్‌): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్‌ రాధాకృష్ణ డిమాండ్‌ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో వచ్చిన చట్టం ఆధారంగా సంక్షేమ బోర్డుకు కేటాయిస్తున్న నిధులను సంక్షేమ పథకాల కోసం మళ్లించడం దారుణమన్నారు. కార్మికుల పిల్లల కు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని, పెళ్లిళ్లకు రూ.లక్ష ఇ వ్వాలన్నారు. కార్మికులకు పీఎఫ్‌, ఈఎస్‌ఐ సదుపా యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కె.సుధాకరప్ప,ఈశ్వరమ్మ, కృష్ణ, వెంకటరాముడు పాల్గొన్నారు.

సివిల్‌ సప్లై హమాలీల నిరసన

కర్నూలు(సెంట్రల్‌): సివిల్‌ సప్లై హమాలీల నిరసన కార్యక్రమం మూడో రోజు కొనసాగింది. బుధవారం కర్నూలు ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ దగ్గర హమాలీలు నిరసన వ్యక్తం చేసి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. 2022 జనవరిలో సివిల్‌ సప్లై హమాలీ కూలీల రేట్లను రూ. 22 నుంచి రూ.25కు పెంచినట్లు ప్రభుత్వం చెప్పిందని, అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు పెంచిన రేట్లను అమలు చేయలేదని సీఐటీయూ సివిల్‌ సప్లై హమాలీల యూనియన్‌ జిల్లా కార్యదర్శి బజారప్ప అన్నారు. స్వీపర్లు, ఇతర కూలీల రేట్లను కూడా పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోలమన్‌రాజు, ఆర్‌కృష్ణ, ఎం.విజయ్‌ పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ వచ్చే నెల 20వ తేదీ నుంచి హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సలాంఖాన్‌ భవనంలో బస్సు యాత్రపై రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐఎస్‌ఎఫ్‌, ఏఐవైఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శులు కారుమంచి, శ్రీరాములుగౌడ్‌, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వి నారాయణ, సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ నాయకులు అర్లప్ప, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు కరుణాకర్‌, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు నగేష్‌, అబ్దుల్లా, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు మునెప్ప, రాధాకృష్ణ, తదితర సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. విభజన హామీల అమలు, ప్రత్యేక హోదాపై ప్రజలను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. అందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో పాటు, విభజన హామీల సాధన సమితిలు కలిసి బస్సు యాత్ర చేపడుతున్నాయన్నారు.